ఐటీ.. ఈ రోడ్డు సంగతేంటీ..?

కారిడార్‌లో కనిపించని సర్వీస్ రోడ్డు

- ఇందిరానగర్‌లో రోడ్డు పక్కన పార్కింగ్, ఫుట్‌పాత్ ఆక్రమణలు
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు



ఇందిరానగర్‌లో పార్కింగ్ ఏరియాగా మారిన సర్వీస్ రోడ్డు ఇదే..

గచ్చిబౌలి: లే అవుట్‌లో ఉన్న సర్వీస్ రోడ్డు కనిపించకుండా పోయింది. ఆక్రమణలు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారం, అక్రమ పార్కింగ్‌తో రోడ్డును మింగేశారు. ఒక వైపు ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని అనేక చోట్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇందిరానగర్‌లో ట్రాఫిక్ రద్దీ ఉన్న చోట సర్వీస్ రోడ్డు ఉందన్న సంగతే జీహెచ్‌ఎంసీ అధికారులు మరిచిపోవడం గమనార్హం. లేఅవుట్‌లో ఉన్న రోడ్డును సరి చేస్తే ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది. కాగా రోడ్డు విస్తరణ అంటే ఆయా స్థలాల యజమానులను ఒప్పించడంలో అధికారులకు తల ప్రాణం తోకకొస్తుంది. అలాంటిది లే అవుట్‌లో ఉన్న సర్వీస్ రోడ్డును పునరుద్ధరించేందుకు మాత్రం మీనమేషాలు లెక్కిస్తుండటం విశేషం.

ఇదీ రోడ్డు పరిస్థితి..

గచ్చిబౌలిలోని వినాయక్‌నగర్ ఎదురుగా కోల్ల మాధవరెడ్డి గార్డెన్‌ను ఆనుకొని ఇందిరానగర్‌లో లేఅవుట్ వేశారు. ప్రధాన రహదారి వెంట సర్వీస్ రోడ్డును వదిలారు. 2004లో సర్వీస్ రోడ్డు స్పష్టంగా కనిపించేది. 2012 తరువాత లే అవుట్‌లో కమర్షియల్ నిర్మాణాలు వెలిశాయి. సర్వీస్ రోడ్డును ఎంచక్కా ఆక్రమించి పార్కింగ్ కోసం ఉపయోగిస్తున్నారు. ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న సర్వీస్ రోడ్డును మినహాయించి జీహెచ్‌ఎంసీ అధికారులు ఫుట్‌పాత్ ఏర్పాటు చేశారు. దీంతో సర్వీస్ రోడ్డును ఎలా వాడుకున్నా ఇబ్బందిలేదన్న భావన కల్పించినట్లయ్యింది. ఉన్న సర్వీస్ రోడ్డును నామరూపాల్లేకుండా చేసి సొంత కార్యకలాపాలకు వినియోగించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ఇందిరానగర్‌లో పాద చారుల సిగ్నల్ వద్ద ట్రాఫిక్‌జాం

అద్దెలు వసూలు..!

ఇందిరానగర్‌లోని రిలయన్స్ సూపర్‌మార్కెట్ ఉన్న భవనం ముందు సర్వీస్ రోడ్డు ఉంది. ఫుడ్ కోర్టు, పూల దుకాణాలు, పండ్ల దుకాణాలు నిర్వహిస్తున్నారు. అక్కడి ఫుట్‌పాత్ వ్యాపారుల నుంచి కొందరు ప్రైవేట్ వ్యక్తులు నెల అద్దె వసూలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సర్వీస్ రోడ్డులో వసూళ్లపై జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

విస్తరణ చేపట్టాలి

ఇందిరానగర్‌లో పాదచారుల సిగ్నల్ ఉండటంతో నిత్యం ఉదయం పూట ట్రాఫిక్ జాం నెలకొంటోంది. సర్వీస్ రోడ్డును పునరుద్ధరిస్తే ట్రాఫిక్ జాంకు చెక్ పెట్టవచ్చు. అంతే కాకుండా లింగంపల్లి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ట్రిపుల్ ఐటీ జంక్షన్ నుంచి ఇందిరానగర్‌లోని పాదచారుల సిగ్నల్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలి. కొంతమేర లేఅవుట్‌లో ఉన్న సర్వీస్ రోడ్డును పునరుద్ధరించి, మాధవరెడ్డి గెస్ట్ హౌస్ నుంచి గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ వరకు విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉంది.



సర్వీస్ రోడ్డులో చిరు వ్యాపారాలు

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 30, పచ్చిమిర్చి 40, బెండ 40, కాకర 40, దొండ 40, దోస 40, ఆలు 40, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 50, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 65, చిక్కుడు 50, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (1) 40 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 400.

విద్యార్థులకు ఉచిత అల్పాహారం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

చందానగర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు డ్రీం ఫర్ గుడ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత అల్పాహారం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గాంధీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అవసరమన్నారు. డ్రీం ఫర్ గుడ్ సొసైటీని అభినందిస్తున్నానన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, సొసైటీ వ్యవస్థాపకురాలు చావా అరుణ, సభ్యులు కళ్యాణి, రోహిత్‌తో పాటు కాలనీ వాసులు బ్రిక్ శ్రీను, గుమ్మడి శ్రీనివాస్, సాంబయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, పూర్ణ, గొర్రెపాటి వివేక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌జాం.. వాహనదారుల ఇబ్బందులు



హఫీజ్‌పేట్ అండర్‌పాస్ వద్ద గజిబిజిగా వాహనాలు



మంజీరా రోడ్డులో యూటర్న్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

గచ్చిబౌలి: హఫీజ్‌పేట్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద అస్తవ్యస్త ట్రాఫిక్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఐటీ ఉద్యోగులు ఉదయం కార్యాలయాలకు వెళ్లే సమయంలో కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. బుధవారం హఫీజ్‌పేట్ అండర్ బ్రిడ్జి వద్ద ఇద్దరు ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ మంజీరా రోడ్డు వరకు వాహనాలు నిలిచిపోయాయి. అండర్‌పాస్‌కు, మంజీరా రోడ్డుకు మధ్యలో అపార్ట్‌మెంట్లకు వెళ్లే చోట కొన్ని వాహనాలు అడ్డదిడ్డంగా వెళ్లడంతో వాటిని క్రమబద్ధీకరించే వారు లేక అరగంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఓవైపు మంజీరా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటంతో ఒక వైపు మాత్రం రాకపోకలు జరుగుతున్నాయి. రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ యూటర్న్ వద్ద ట్రాఫిక్ సిబ్బంది లేక అక్కడా వాహనాలు నిలిచిపోయాయి. చందానగర్ నుంచి వచ్చే వాహనాలు, కొండాపూర్, హఫీజ్‌పేట్ నుంచి వాహనాలు యూటర్న్ వద్ద నిలిచిపోయాయి. వాటిని క్రమబద్ధీకరించే సిబ్బంది లేక వాహనదారులు ఇబ్బందులుపడ్డారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను కూకట్‌పల్లి డివిజన్‌లోని అశోక్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ హాజరై కేక్‌కట్ చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, చంద్రారెడ్డి, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎడ్వర్డ్ రోస్, కమిటీ సభ్యులు యేసు రాజు, కొమ్ము సాగర్, సీహెచ్.మాణిక్యం, ఆనంద్ ప్రసాద్, జార్జ్, జైపాల్ సుధాకర్ పాల్గొన్నారు.

శివకుమార్‌కు పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శివకుమార్

ఆల్విన్‌కాలనీ: భారతీయ దళిత్ సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన మహాత్మా జ్యోతిరావు పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డును ప్రగతినగర్‌కు చెందిన శ్రీరామోజు శివకుమార్ బుధవారం అందుకున్నారు. శివకుమార్ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి 20 ఏళ్లుగా ప్రజా సమస్యలపై పోరాడుతూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పురోగతికి పాటుపడుతున్నారు. పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ నెలసరి జీతంతో ఆర్థిక సాయం తదితర సేవలకు గుర్తింపు వచ్చింది. అవార్డు రావడంపై శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు.

మనూలో అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: హిందీ, ఉర్దూ భాషలు, సంగీతానికి అమీర్ ఖుస్రూ చేసిన కృషి మరువలేనిదని కెనడాలోని టొరంటో నోబెల్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ రతన్‌లాల్ హంగ్లూ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం, కల్చర్ హౌస్ ఆఫ్ ది ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ముంబై సంయుక్తంగా 'అమీర్ ఖుస్రూ: యాన్ ఐకాన్ ఆఫ్ ది కాంపోజిట్ కల్చర్ ఆఫ్ ఇండియా' పేరిట నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అమీర్ ఖుస్రూ భారతీయ చరిత్రపై చేసిన కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రొ.రతన్‌లాల్ హంగ్లూకు జ్ఞాపికను అందిస్తున్న వీసీ ఐనుల్ హసన్

ఘనంగా 'భారతీయ భాషా ఉత్సవ్'

రాయదుర్గం: భారత జాతీయ ఉద్యమంలో సుబ్రహ్మణ్య భారతి కీలకపాత్ర పోషించారని మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అన్నారు. భారత స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖ తమిళ రచయిత, పాత్రికేయుడు సుబ్రహ్మణ్య భారతి జయంతిని పురస్కరించుకొని బుధవారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో భారతీయ భాషా ఉత్సవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య భారతికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయన కేవలం ఒక ప్రాంతానికి, రాష్ట్రానికి మాత్రమే పరిమితం కాలేదని, జాతీయ స్థాయిలో పాత్ర పోషించారన్నారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా, మహిళా సాధికారత కోసం విస్తృతంగా ప్రచారం చేశారని తెలిపారు. ప్రొఫెసర్ ఎంకేఎం జాఫర్ మాట్లాడుతూ భాషల వైవిధ్యం నాగరికత ప్రత్యేకతను పెంచుతుందన్నారు. ఇది భారతదేశ గుర్తింపు, ప్రత్యేకతను నిలుపుతుందన్నారు. అనంతరం భారత దేశ భాషా వైవిధ్యం, సుబ్రహ్మణ్య భారతి సేవలపై విద్యార్థులు, పరిశోధకులు వివిధ భాషల్లో తమ అభిప్రాయాలను వెల్లడించారు.

తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా కొండ విజయ్‌కుమార్



చందానగర్: తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా చందానగర్‌కు చెందిన కొండ విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. బుధవారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికల ఫలితాల్లో మాజీ పార్లమెంట్ సభ్యులు జితేందర్‌రెడ్డి ప్యానల్‌లో సంయుక్త కార్యదర్శిగా కొండ విజయ్‌కుమార్ విజయం సాధించారు. పలువురు అసోసియేషన్ సభ్యులతో పాటు పలు క్రీడా సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆయన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి పాటుపడుతానన్నారు.

రోడ్డు ఆక్రమణలపై ధర్నా

నిజాంపేట్: రోడ్డు ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని బీజేపీ నిజాంపేట్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆరోపించారు. బాచుపల్లి నుండి మల్లంపేట్ రోడ్డు మార్గంలోని సర్వే నంబరు 39, 38, 54లలో హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆక్రమణలను తొలగించి రోడ్డును పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం సతీష్ ఆధ్వర్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. హెచ్‌ఎండీఏ అధికారులు ఆక్రమణలను తొలగించాలని గత నెల 13న ఉత్తర్వులు జారీ చేసినా రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో కమిషనర్ వెనుకంజ వేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు ఆక్రమణలతో మల్లంపేట్ ఔటర్ ఎగ్జిట్ నుండి బాచుపల్లి వరకు తీవ్ర ట్రాఫిక్ జామ్ అవుతోందని, చర్యలు తీసుకోని పక్షంలో కార్పొరేషన్ కార్యాలయాన్ని స్థానిక ప్రజలతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు.

గీతా జయంతి

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో బుధవారం గీతా జయంతిని అధ్యాపకుడు డాక్టర్ లంక పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించారు. భగవద్గీత త్యాగానికి నిదర్శనమని ప్రిన్సిపల్ పి మురళి పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి త్యాగభావం, ఏకాగ్రత కలిగి ఉండాలని సూచించారు. పార్థసారథి మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మాట తప్పకుండా పాటించాలన్నారు. కృష్ణుడి వంటి గురువు అర్జునుడి వంటి శిష్యుడు ఈ ప్రపంచంలోనే లేరని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇన్‌కాయిస్‌ను సందర్శించిన విద్యార్థులు

నిజాంపేట్: దుండిగల్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు విహారయాత్రలో భాగంగా బుధవారం ప్రగతినగర్‌లోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్) ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌కాయిస్‌లో జరిగే కార్యకలాపాలు, తుఫాన్ సందర్భంగా జారీచేసే హెచ్చరికలు తదితర అంశాలను ఇన్‌కాయిస్ అధికారులు వివరించారు. విద్యార్థుల వెంట కార్పొరేటర్ రావుల శేషగిరి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేష్, అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్, జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు ఉన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ గుర్తింపు కార్డుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: పీఆర్‌టీయూ కూకట్‌పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కూకట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని సభ్యులందరికీ కార్డులను ఇస్తామన్నారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ జి. విఠల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ రెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మీ, వీరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నిజాంపేట్: స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో హన్మంతరెడ్డికి పలు కాలనీలు, బస్తీల ప్రజలు సమస్యలపై వినతులు సమర్పించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వేయించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు, యాదగిరి, మానెయ్య, భిక్షపతి, బ్రహ్మచారి, మధు తదితరులు ఉన్నారు.

పాఠశాలలో మాక్ ఎలక్షన్



రాయదుర్గం: ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే తాజ్‌బాబు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులే రిటర్నింగ్ అధికారి, ప్రొసీడింగ్ అధికారి, పోలింగ్ అధికారులు, పరిశీలకులు, సిబ్బందిగా.. విద్యార్థులు ఓటు వేయడం.. ఓట్ల లెక్కింపు తదితరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్లాస్ ప్యూపిల్ లీడర్(సీపీఎల్), ఎస్‌పీఎస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వర్ణలత, సుభాషిణి, శాంతాబాయి, క్రాంతి, కృష్ణవేణి, వాణిశ్రీ, వసంత, ఫరీదా, శ్రీనివాస్, సునందిని, మహిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెచ్చని నేస్తాలు



హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి ఆల్విన్ కాలనీ చౌరస్తా, జాతీయ రహదారి పక్కన దుప్పట్ల దుకాణాలు

చందానగర్: శీతాకాలం వచ్చిందంటే ప్రతి ఒక్కరికి గుర్తుకు వచ్చేది రగ్గులు, స్వెట్టర్లు. శీతాకాలం.. చలి పెరగడంతో ఉన్ని దుస్తులకు డిమాండ్ పెరిగింది. హఫీజ్‌పేట్ పాత ముంబై రోడ్డు, ఆల్విన్‌కాలనీ బస్టాప్ వద్ద స్వెట్టర్లు, రగ్గుల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురిశాయి. అలాగే చలి కూడా పెరిగింది. ఈ ఏడాది హఠాత్తుగా చలి పెరగడం.. తర్వాత తగ్గడం.. వాతావరణం విచిత్రంగా మారింది. చలికాలం కావడంతో మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన చిరు వ్యాపారులు దుప్పట్లు, స్వెటర్లు, మంకీ క్యాపులు, మాస్కులు, గ్లౌజులు అమ్మకాలకు ఉంచారు. హిమాచల్ ప్రదేశ్, లూథియానా, హర్యాణ తదితర ప్రాంతాల నుంచి ఉన్ని దుస్తులు తెచ్చి అమ్ముతున్నారు. ఈ వ్యాపారులంతా 3 నెలలపాటు ఇక్కడ వ్యాపారం చేస్తారు. రూ.150 నుంచి వెయ్యి రూపాయల వరకు వివిధ రకాల స్వెట్టర్లు, దుప్పట్లు విక్రయిస్తున్నారు.



అమ్మకాలు తగ్గాయి



రోజురోజుకు ధరలు పడిపోతున్నాయి. దుప్పట్ల వాడకం కూడా తగ్గింది. 11 సంవత్సరాల నుంచి వ్యాపారం చేస్తున్నాను. కూలీల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. వివిధ రాష్ట్రాల నుంచి ట్రాన్స్‌పోర్టు ద్వారా దుప్పట్లు తెప్పిస్తున్నాం.

–అంతర్, వ్యాపారి

చలికాలం హైదరాబాద్‌కు వస్తాం



చలికాలం హైదరాబాద్ నగరానికి దుప్పట్ల వ్యాపారానికి వచ్చేస్తాం. ప్రతి సంవత్సరం నవంబర్ నుంచి జనవరి వరకు వ్యాపారం చేస్తాం. అన్ని సైజుల్లో స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు తదితరాలు ఉన్నాయి. ఇప్పుడు వ్యాపారం కొద్దిగా తగ్గింది.

–నీలేష్, దుప్పట్ల వ్యాపారి

ప్రతి ఇంటికీ మంచినీరు అందించాలి

- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: జలమండలి ఆధ్వర్యంలో ఓఆర్ఆర్ ఫేజ్- 2 పరిధిలో చేపడుతున్న రిజర్వాయర్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో జలమండలి ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల ప్రగతిని ఎమ్మెల్యేకు వివరించారు. ప్రధానంగా బొల్లారం, బీరంగూడ, అమీన్‌పూర్, తెల్లాపూర్ పరిధిలో రిజర్వాయర్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. రాబోయే 15 రోజుల్లో పంపింగ్ పనులు సైతం పూర్తి చేసి నీటిని విడుదల చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. కాలుష్య జలాలతో ఇబ్బంది పడుతున్న బొల్లారం మున్సిపల్ పరిధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. పైపులైన్ల లీకేజీ విషయంలో త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జలమండలి జీఎం సుబ్బారాయుడు, డీజీఎంలు చంద్రశేఖర్, శివకుమార్, ఏఈలు ప్రవీణ్, పూర్ణేశ్వరి, శ్రీనివాస్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్పలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బుధవారం బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. నిజాంపేట్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు నిర్వహించారు.

భెల్‌లో మాక్ డ్రిల్



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ పరిపాలన భవనం వద్ద బుధవారం భెల్, బీడీఎల్ సీఐఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, రాష్ట్ర అగ్నిమాపకదళం సంయుక్త ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భెల్ ఈడీ కే.బి.రాజా, భెల్ హెచ్‌పీఈపీ ఈడీ విజయ్ సాగర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ అగ్నిప్రమాదాలు, భూకంపాలు, భవనాలు కూలిన ఘటనలో అందులో చిక్కుకున్న వారిని రక్షిస్తారో రిస్క్ ఆపరేషన్ డ్రిల్ ప్రదర్శించారు. విపత్తుల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ మంజిత్ కుమార్, అసిస్టెంట్ కమాండర్ దామోదర్ సింగ్, రామచంద్రాపురం పోలీసులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రూ. 2 వేలు జరిమాన, అదేవిధంగా ఐదుగురికి రూ. 1500 చొప్పున జరిమానా, మరో ముగ్గురికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.